RNI. No. TELTEL /2022/ 89348




మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 | సంచిక : 96 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | ఆదివారం, మార్చి, 29, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## యుద్ధంతో సంక్షోభంలో పలు దేశాలు

### ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత:ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 28:పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు. ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సంక్షోభ సమ యంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటిం చాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు. నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న



అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ. 11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

## మెట్రో ఇకపై ప్రభుత్వ సొత్తు..

### ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం..!

### సీఎం రేవంత్ ప్రవేశ పెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవ ఆమోదం

### ఫేజ్-2 విస్తరణకు అడ్డంకుల నివారణే ప్రధాన లక్ష్యం

### టికెట్ ధరలు, సౌకర్యాల్లో మెరుగుదలకు ప్రభుత్వం హామీ

**హైదరాబాద్,మార్చి,28:** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్-2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్-1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' (ఎవీ=వా) ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఈ స్వాధీన ప్రక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్-2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్-2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ



కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్-2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## హైదరాబాద్ శివార్లలో అక్రమ మైనింగ్..

### - ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం..- స్టోన్ క్రషర్లలో నిబంధనల ఉల్లంఘనలు

### - తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి హరీష్ రావు డిమాండ్



**హైదరాబాద్,మార్చి,28:** హైదరాబాద్ నగర శివారుల్లో, నగరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ సాగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. శాసనసభలో మైనింగ్ శాఖ డిమాండ్లపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న తీరును ఆధారాలతో సహా సభ ముందు ఉంచారు. మైనింగ్ శాఖ అనేది రాష్ట్రానికి పన్నేతర ఆదాయాన్ని (చీశీఅ-ఝఇ =వజవఅబవ) సమకూర్చే అత్యంత కీలకమైన శాఖ అని, ఇక్కడ ప్రభుత్వం , అధికారులు ఎంత జాగ్రత్తగా ఉంటే రాష్ట్ర ఖజానాకు అంత మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు 'కంచే చేను మేసినట్లు' ఉన్నాయని హరీష్ రావు విమర్శించారు. రక్షకులే భక్షకులుగా మారుతుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆరోపించారు. తాను చేసే ప్రతి ఆరోపణకూ ప్రభుత్వ డాక్యుమెంట్లే సాక్ష్యమని, ఏ ఒక్క మాట కూడా గాలిలో మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నడిబొడ్డున ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ మైనింగ్ వ్యాపారాలు దర్జాగా సాగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న మనం రాష్ట్రానికి వచ్చే ప్రతి పైసాను కాపాడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. ముఖ్యంగా స్టోన్ క్రషర్ల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలను ఆయన ఎత్తి చూపారు. ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 'తెలంగాణ స్టోన్ క్రషర్ రూల్స్ 2025' (జీఓ నెంబర్ 26) నిబంధనలను తుంగలో తొక్కి, నగర పరిసరాల్లో డీజిల్ జనరేటర్ల సహాయంతో క్రషర్లు నడుపుతున్నారని ఆరోపించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికే కాకుండా ప్రభుత్వ ఖజానాకు కూడా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, దీన్ని ఒక సద్విమర్శగా తీసుకుని ప్రభుత్వం తక్షణమే సరిదిద్దుకోవాలని సూచించారు. తాను సేకరించిన అన్ని డాక్యుమెంట్లను మంత్రికి అందజేస్తానని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని రాష్ట్ర ఆదాయాన్ని కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## డీఎంకే జాబితా విడుదల..

## కొలతూర్ నుంచి సీఎం స్టాలిన్ పోటీ



చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 164 మంది అభ్యర్థుల జాబితాను డీఎంకే శనివారంనాడు విడుదల చేసింది. ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మరోసారి కొలతూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చెపాక్-ట్రిప్లికేన్ నుంచి, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ కోయంబత్తూరు సౌత్ నుంచి, ఓ పన్నీర్ సెల్వం బోడినాయక్కనూరు నుంచి పోటీ చేస్తున్నారు.ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెన్నైలో అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. సెక్యులర్ ప్రోగ్రసివ్ అలయెన్స్ (ఎస్‌పీఏ)కు డీఎంకే సారథ్యం వహిస్తోంది. సీట్ల ఒప్పందంలో భాగంగా 234 స్థానాలకు గాను డీఎంకే 164 స్థానాల్లో పోటీ చేస్తోంది. డీఎంకే భాగస్వామ్య కాంగ్రెస్ పార్టీ పొన్నేరి, ఈరోడ్ ఈస్ట్, విలవాంకోడె, శివకాశీ, కారైకుడి సహా 28 సీట్లలో పోటీ చేస్తోంది. ప్రేమలత విజయకాంత్ సారథ్యంలోని డీఎండీకేకు 10 సీట్లు కేటాయించారు. విడుదలై చిరుతైగల్ కట్చి (వీసీకే) 8 సీట్లలో పోటీ చేస్తోంది. సీపీఐ, సీఎంలు చెరో 5 సీట్లలో పోటీ చేస్తున్నాయి. వైకో సారథ్యంలోని ఎండీఎంకే 4 స్థానాల్లో పోటీ చేయనుంది.తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న ఒకే విడతలో జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడతాయి.

## హోర్ముజ్ జలసంధి దాటిన మరో రెండు నౌకలు

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఏర్పడిన ఇంధన సంక్షోభం నుంచి భారత్‌కు ఉపశమనం లభిస్తోంది. కీలకమైన స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ దాటి భారత్‌కు పెట్రోలియం ఉత్పత్తులను మోసుకొస్తున్న మరో రెండు వాణిజ్య నౌకలు సురక్షితంగా ప్రయాణిస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. భారత నౌకాదళం ఈ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన రక్షణ కల్పిస్తున్నాయి. భారత నౌకాదళ యుద్ధనౌకలు ఈ జలసంధి సమీపంలో 'స్టాండ్‌బై'లో ఉన్నాయి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రెండు నౌకలు ప్రయాణిస్తుండగా, రాబోయే రోజుల్లో మరిన్ని నౌకలు ఇదే మార్గంలో వచ్చే అవకాశం ఉందని సమాచారం. పర్షియన్ గల్ఫ్, గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం భారతీయ జెండాతో ఉన్న 20 నౌకలు ఉన్నాయని, అందులో పనిచేస్తున్న సుమారు 540 మంది భారతీయులు సురక్షితంగా ఉన్నారని షిప్పింగ్ మంత్రిత్వ



శాఖ స్పెషల్ సెక్రటరీ రాజేష్ కుమార్ సిన్హా చెప్పారు. ఇప్పటికే నాలుగు ఎల్‌పీజీ నౌకలు భారత్ చేరుకోగా, తాజా నౌకల రాకతో ఇళ్లకు వినియోగించే గ్యాస్ కొరత తగ్గే అవకాశం ఉంది.

## అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం..

### కాలిబూడిదైన వెదురు మండపం

అయోధ్య (ూఎశీసష్త్రఖ) లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన మహా యజ్ఞశాలలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సరయూ నది తీరంలోని జమ్తారా ఘాట్ వద్ద నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ మహాయజ్ఞంలో ఈ అగ్నిప్రమాదం సంభవించింది. యజ్ఞం ముగిసిన మరుసటి రోజే ఈ ప్రమాదం జరగడం గమనార్హం. యజ్ఞశాలలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒక ఎకరం విస్తీర్ణంలో వెదురు, గడ్డితో నిర్మించిన మండపం క్షణాల్లో కాలి బూడిదయింది. కాగా ప్రమాద సమయంలో యూపీ రవాణా మంత్రి దయాశంకర్ సింగ్, పలువురు ఉన్నతాధికారులు అక్కడే ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆరు అగ్నిమాపక యంత్రాలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. యజ్ఞ గుండంలోని నిప్పురవ్వలు ఎగిసి పడటం వల్లనే మండపానికి మంటలు అంటుకుని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. యజ్ఞ నిర్వహణలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించలేదని, నిపుణుల పర్యవేక్షణ లేకుండానే ఇంతటి భారీ కార్యక్రమాన్ని నిర్వహించారని ఆరోపిస్తున్నారు. కేవలం ఖర్చు తగ్గించుకోవాలనే ఉద్దేశంతో భద్రతా ఏర్పాట్లను గాలికి ఒదిలేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ భారీ కార్యక్రమం వెనుక ఉన్న ఆర్థిక



వనరులు, మానవ వనరుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

## అమరావతికి చట్టబద్ధత తీర్మానాన్ని కేంద్రానికి పంపిన ఏపీ సర్కార్



అమరావతి, మార్చి 28: రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వంఢిల్లీకి పంపించింది. కేంద్ర హోం శాఖ మంత్రి, రాజ్యసభ చైర్మన్, లోక్‌సభ స్పీకర్‌కు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీర్మానాన్ని పంపించారు. అలాగే కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఏపీ చీఫ్ సెక్రటరీకి తీర్మానం కాపీని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ పంపారు. ఈ తీర్మానాన్ని మెయిల్ ద్వారా పంపడంతో పాటు, నేరుగా ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారి ద్వారా ఢిల్లీకి పంపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోజు సాయంత్రానికి ఢిల్లీకి తీర్మానాన్ని పంపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడమే కాకుండా భవిష్యత్తులో ఎవరు వచ్చినా కూడా అమరావతిని మార్చే అవకాశం లేకుండా చేసే ఉద్దేశంతోనే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని సవరిస్తూ ఏపీ శాసనసభ ఈరోజు ఏకగ్రీవ తీర్మానం చేసింది.

# సంపాదకీయం

## యెల్లో మెటల్ ధరల పతనానికి
## రష్యా మాస్టర్ స్ట్రోక్..

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ. 1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఎనిమిదవ వింతలా మారుతుందేమోనన్న ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ. 1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధరలు అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం రష్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి.ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ, కొనుగోలుదారులు ఒకేసారి భారీగా పెట్టుబడి పెట్టకుండా ధరలు పూర్తిగా స్థిరపడే వరకు వేచి చూడటం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఏది ఏమైనా, పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ధరలు తగ్గుతుండటం భారతీయ కుటుంబాలకు పెద్ద ఊరటనిచ్చే విషయమే. రష్యా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఆర్థిక మార్పులకు దారితీస్తుందో రానున్న రోజుల్లో చూడాలి.గతేడాది బంగారం ధరలు ఏకంగా 70% మేర పెరిగి రికార్డు స్థాయి రూ. 1.80 లక్షలను తాకాయి. అయితే, అంతర్జాతీయంగా ఔన్సు బంగారం ధర ప్రస్తుతం ఉన్న 5,000 డాలర్ల నుండి 3,000 డాలర్లకు పడిపోతే, దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ. 90,000 నుంచి రూ. 1,00,000 మధ్య స్థిరపడొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## జీడీకే-2వ గనిపై టీబిజికెఎస్ నిరసన

### - పాల్గొన్న మిర్యాల రాజిరెడ్డి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 28: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శనివారం సింగరేణి జిడికె-2వ గనిపై నిరసన కార్యక్రమం చేపట్టింది. దీనికి అధ్యక్షులు మిర్యాల రాజి రెడ్డి హాజరైనారు. గని కార్మికులకు నల్ల బ్యాడ్జీలు పెట్టి వారందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ "రక్తాన్ని చెమటగా మార్చి" ఉత్పత్తి తీసి దేశానికి వెలుగునిచ్చే" సింగరేణి కార్మికులకు ప్రతి నెల మెడికల్ బోర్డులు నిరంతరాయంగా నిర్వహించాలని, మెడికల్ అన్ఫిట్ చేయబడిన కార్మిక వారసులకు తక్షణమే ఉద్యోగ నియామక ఉత్తర్వులు ఇవ్వాలి. జులై, నవంబర్ నెలలో అర్హత కలిగి అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు అన్ఫిట్ చేయలేదు. వారికి తిరిగి వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలి. విజిలెన్స్ మరియు మారుపేరుల సమస్యను పరిష్కరించాలి. మెడికల్ బోర్డు రద్దుకై సింగరేణి యాజమాన్యం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను విరమించుకోవాలి. గత రెండు సంవత్సరాల కాలంగా మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్న రెండు వేలకు పైగా కార్మికులకు న్యాయం చేయాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన 50 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే రాబట్టాలి. ఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు హామీ ఇచ్చారు. వీరి మాట నమ్మిన కార్మికులు మోసపోయారు. శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి హయాంలో అనేక మెడికల్ బోర్డు నిర్వహించి వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు ఇప్పించామని గుర్తు చేశారు. టీబీజీకేఎస్ మాత్రమే కార్మికుల హక్కులను పరిష్కరించగలిగిందని తెలిపారు. ఇప్పటికైనా విచారణ పేరుతో మెడికల్ బోర్డు నిర్వహించకుండా నిలిపివేయడానికి ఖండిస్తున్నాం. తప్పులు జరిగితే దోషులను శిక్షించండి. కానీ విచారణ పేరుతో మెడికల్ బోర్డుని నిలిపివేయడం సరైనది కాదు. తక్షణమే "మెడికల్ బోర్డు" నిర్వహించి అర్హులైన వారందరినీ అన్ఫిట్ చేసి వారి వారసులకు ఎలాంటి జాప్యం లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు అనంతరం మేనేజర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి వడ్డేపల్లి శంకర్ ఆర్జీవన్ వైస్ ప్రెసిడెంట్ అధ్యక్షత వహించగా నాయకులు మాదాసి రామ్మూర్తి వర్కింగ్ ప్రెసిడెంట్, నూనె కొమురయ్య సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్, దూట శేషగిరి బ్రాంచ్ సెక్రటరీ, ఉప్పులేటి తిరుపతి ఫిట్ సెక్రెటరీ, మరియు మీసా రాజు, పూర్ణ చందు, భాస్కర్ ,వేణు, నరేష్, శ్రీకాంత్ , అభిషేక్, రవి, ప్రసాద్, ప్రవీణ్, సుల్తాన్, మధు, రమేష్, తిరుపతి, రాహుల్, సుకుమార్ పాల్గొన్నారు. అంతేగాకుండా ఆర్జీవన్ డివిజన్లోని అన్ని బావులు మరియు డిపార్ట్మెంట్లలో కూడా నల్ల బ్యాడ్జీల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో సెంట్రల్ నాయకులు పోలాడ శ్రీనివాసరావు, మోదంపల్లి రాజేశం, మురళి, ఉప్పులేటి తిరుపతి, దిడ్డి లక్ష్మణ్, వాసర్ల జోసెఫ్, జనగాం మల్లేష్, అడ్డగట్ల గోపి, పుప్పాల రవీందర్, కొయ్యడ మల్లేష్, అప్సర్ పాషా పులిపాక శంకర్, రోడ్డ సంపత్ పాల్గొన్నారు.

## పైప్ లైన్ లేకేజ పనుల స్పీడప్ పెంచాలి

### - మేయర్ మహంకాళి స్వామి



తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 28:నీటి సరఫరా పైప్ లైన్లలో లీకేజీలను యుద్ధ ప్రాతిపదికన అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. శారదా నగర్ పి జి కళాశాల ఎదుట డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ లలో ఏర్పడిన లీకేజీలను మరమ్మత్తు చేస్తున్న పనులను శనివారం ఆయన అక్కడే కూర్చొని పర్యవేక్షించారు. లీకేజీ కారణంగా ప్రశాంత్ నగర్ నుండి పవర్ హౌజ్ కాలనీ వరకు దాదాపు నాలుగు డివిజన్ లలో నీటి సరఫరా కు అంతరాయం ఏర్పడినందున సాయంత్రం లోపు మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రేపటి నుండి నీటి సరఫరా యధాతథంగా కొనసాగాలని ఆదేశించారు. లీకేజీ ఎవరు గుర్తించినా ఫోన్ నెం . 9392483959 కు సమాచారం లేదా ఫోటో తీసి లొకేషన్ వాట్సాప్ చేయాలని అన్నారు. మునిసిపల్ సేవలకు సంబంధించి ఏ లోపం తలెత్తినా పై నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేసవి కాలం దృష్ట్యా ప్రజలు కూడా నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అన్నారు. ప్రతి కనెక్షన్ కు నీటి సరఫరా నిలిపివేసే వాల్వ్ అమర్చుకోవాలని సూచించారు. ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని వేసవి కాలంలో నీటి కొరత ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

## జీడికే 11 ఇంక్లైన్ ఉద్యోగస్తుల మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ గనిపై ఏప్రిల్ 3న సిఐటియు నిరసన దీక్ష జయప్రదం చేయండి

### తుమ్మల రాజారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) ఉదయం 7:00 గంటలకు జీడికే 11 ఇంక్లైన్ లో జంగపల్లి మల్లేష్ అధ్యక్షతన గేట్ మీటింగ్ జరిగింది, ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల రాజారెడ్డి గారు మాట్లాడుతూ, పూర్తిగా +ఎఎ- 11 ఇంక్లైన్ ఉద్యోగస్తులకు కనీస మౌనిక సౌకర్యాలు కల్పించడంలో యజమాన్యం విఫలమైందని, గత 3 నెలల నుంచి రెండుసార్లు సిఐటియు బృందంగా గని పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై అధికారులకు కార్మికుల సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందించి మాట్లాడినప్పటికీ ఇప్పటికీ ఒక్క పని కూడా ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగస్తులు భోజనాలు చేస్తున్న సమయంలో కోతులు కుక్కల బెడదతో భయభ్రాంతులకు లోన్ అవుతూన్న పరిస్థితి ఉందని. గని పైనే ఇలాంటి పరిస్థితులు ఉంటే గని అండర్ గ్రౌండ్ లో అనేక సమస్యలను ఎదుర్కొంటూ పనిచేస్తున్నారని. ఇప్పటికీ ఎల్ హెచ్ డి సెక్షన్ లో సరైన గాలి లేక కార్మికులు పని ఒత్తిడికి గురై అనారోగ్యాల పాలో అవుతున్నారని. మహిళా ఉద్యోగస్తులకు కనీస సౌకర్యాలు క్రచ్ రెస్ట్ రూములు అండర్ గ్రౌండ్ లో వాష్రూములు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలు కార్మికులకు అనుకూలంగా ఉంటేనే అధిక ఉత్పత్తి వచ్చే అవకాశాలు ఉన్నాయని అదినాతనమైన టెక్నాలజీతో కంటిన్యూస్ మైనర్స్. ఎల్ హెచ్ డి వెహికల్స్ తో అధిక బొగ్గు ఉత్పత్తి తీస్తున్నప్పటికీ. ఉద్యోగస్తులను బెదిరింపులకు గురిచేస్తూ రక్షణను గాలికి వదిలేసి తమాషా చూస్తున్నారని అధికారులను హెచ్చరించారు. ఇప్పటికైనా మేము సూచిస్తున్న స్థానిక సమస్యలైన 21 డిమాండ్స్ తక్షణమే అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలని నేను యెడల గనిపై 2026 ఏప్రిల్ 3న సిఐటియు నిరసన దీక్ష చేపడుతుందని, ఉద్యోగస్తులు అందరూ భాగస్వామ్యం అయ్యి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గని ఆవరణలోని వాటర్ ఫిల్టర్ బెడ్డు సంక్షేమ అధికారితో కలిసి సందర్శించారు... ఈ కార్యక్రమంలో సిఐటియు బ్రాంచ్, ఫిట్ నాయకత్వం. ఆర్జీవన్ గౌరవాధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి గారు, తోట నరహరి రావు గారు, కార్యదర్శి మెండే శ్రీనివాస్ గారు జాయింట్ సెక్రెటరీ జెల్ల గజేందర్, గని ఫిట్ సెక్రెటరీ జంగపల్లి మల్లేష్, మునుకుంట్ల రామన్న, మహేందర్ రాజు, శివ, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

## నక్సలిజంపై పోరు..
## మార్చి 30న కేంద్రం కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,మార్చి,28:** భారతదేశ అంతర్గత భద్రతకు దశాబ్దాలుగా సవాలుగా మారిన నక్సలిజం సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేస్తోంది. ఈ క్రమంలోన మార్చి 30న లోక్ సభలో నక్సలిజం నిర్మూలనపై ఒక చరిత్రాత్మక చర్చకు తెరలేవనుంది. దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ప్రభావాన్ని పూర్తిగా తుడిచి పెట్టేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో ప్రకటించిన 'మార్చి 2026' గడుపు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ చర్చ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభలో రూల్ 193 కింద ఈ స్వల్పకాలిక చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ఈ చర్చను ప్రారంభించనున్నారు. దేశ వ్యాప్తంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం తీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సభ దృష్టికి తీసుకురానున్నారు. కేవలం ఆపరేషన్‌లే కాకుండా, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజలకు ఎలాంటి సేవలందిస్తున్నారన్న అంశంపై సుదీర్ఘ చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది.

# చిన్నారుల కోసం 'తొలి ముద్ద'
## పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్



**హైదరాబాద్,మార్చి,28:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో సుపరిపాలన అందిస్తున్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండింటిని జోడెద్దుల్లా పరుగులు పెట్టిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఏదో ఒక పథకాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా మరో స్కీమ్‌కు సీఎం శ్రీకారం చుట్టారు. అంగన్వాడీ చిన్నారులకు అల్పాహారం అందించేందుకు 'తొలి ముద్ద' అనే పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఉప్మా, కిచిడీ మిక్స్‌ను బ్రేక్‌ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..' గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చార. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టింది' అని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందని వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామన్నారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలానే ఎల్బీ స్టేడియంలో లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఆటల పోటీలు నేడు, రేపు కొనసాగనున్నాయి. రేపు రవీంద్ర భారతిలో కల్చలర్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

## రెండుగా పాకిస్తాన్

లాహోరం, : మన పొరుగు దేశం పాకిస్తాన్ మళ్లీ రెండు ముక్కలు కాబో తోందా అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు. దశాబ్దాలుగా పాకిస్తాన్ నుంచి విభజన పోరాటం చేస్తున్న బలూచిస్తాన్.. పాకిస్తాన్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయం అయినట్లు తెలుస్తోంది. ఇటీవల పాకిస్తాన్ మంత్రి చట్టసభలో మనము.. వాళ్లు అని చెప్పడం 1971 బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు వాడిన పదాలను గుర్తు చేస్తోంది. ఈ పరిణామాలు బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) 1 నిమిషం 10 సెకన్ల వీడియోలో పాకిస్తాన్ సైనికులు జీమిల్, షమ్షబ్రేజ్‌లను చూపించింది. వీరిని 7 రోజుల్లో విడుదల చేయకపోతే చంపేస్తామని హెచ్చరించారు. 5 వేల అత్యాధునిక డ్రోన్లతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌పై దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,184 మంది పాక్ సైనికులు మరణించారు.




# 'ఖని'లో మ్యూల్ ఖాతాల దందా

## - పలు బ్యాంకుల్లో మ్యూల్ అకౌంట్లు - అమాయకులే సైబర్ నేరగాళ్ల టార్గెట్ - ఎర చూపి వల వేస్తున్న వైనం - ఏజెంట్ల ద్వారా సైబర్ అకౌంట్లు

తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 28: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మ్యూల్ అకౌంట్ల దందా కొనసాగుతుంది. ఇక్కడి పలు బ్యాంకుల్లో మ్యూల్ అకౌంట్లు ఉన్నట్టు తెలుస్తుంది. సైబర్ నేరగాళ్ళ ఏజెంట్ల ద్వారా ఈ అకౌంట్లు తెరిపిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఈ మధ్య కాలంలో మ్యూల్ అకౌంట్లపై సైబర్ పోలీసులు నిఘా పెట్టి చర్యలకు ఉపక్రమించడంతో ఈ విషయంపై ఇక్కడ కూడ చర్చ జరుగుతుంది. మ్యూల్ అకౌంట్లను కరీంనగర్ లో ఫ్రీజ్ చేయడంతో సైబర్ నేరగాళ్ళకు, వారి ఏజెంట్లకు గుబులు పట్టుకుంది. గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని పలు బ్యాంకుల్లో ఇలాంటి అకౌంట్లు కోకొల్లొలుగా దర్శనమిస్తున్నాయు. ముఖ్యంగా స్లం ఏరియాలోని యువత, మహిళలను వారి ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు వారివారి ఏజెంట్ల ద్వారా మ్యూల్ అకౌంట్లు తెరిపిస్తున్నట్టు తెలుస్తుంది. ముందుగా వారి ఆధార్, పాన్, ఫోటో ఇస్తే రు. 5 వేల నుంచి 10 వేల వరకు ముట్టజెప్పి వారి పేరుపై ఏజెంట్ల ద్వారా ఒక కొత్త సిమ్ తో అకౌంట్ ఓపెన్ చేపిస్తారు. అకౌంట్ బుక్, డెబిట్ కార్డు వారీ వద్దనే ఉంచుకుని కొత్త ఫోన్ నెంబర్ ద్వారా లావాదేవీలు కానిస్తారు. సైబర్ క్రైమ్ ద్వారా వచ్చిన డబ్బును ఇలాంటి వివిధ అకౌంట్లలోకి మళ్ళిస్తారు. ఈ తంతు జోరుగా సాగుతుందని ప్రచారం జరుగుతుంది ఇదిలావుండగా సందేట్లో సడేమియాలాగా కొంత మంది హుషార్ గాళ్ళు వారి అకౌంట్ల పడిన




డబ్బును సైబర్ నేరగాళ్ల కంటే ముందుగానే డ్రా చేసుకుంటున్నారని వినికిడి. అయితే మ్యూల్ అకౌంట్లు మున్సిపల్ ఆఫీస్ ముందున్న బ్యాంకుల్లో అధికంగా ఉన్నట్టు సమాచారం. అయితే ఈ అకౌంట్ల పై అధికారులు నిఘా పెట్టడంతో అకౌంట్ లు తీసిన వారీ గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకునే పనిలో అధికారులు ఉన్నారు. సైబర్ పోలీసులు లోతుగా విచారణ చేపడితే మ్యూల్ అకౌంట్ల దందా వెనుక ఎవెరెవరు ఉన్నారనే విషయాలు బయట పడే అవకాశం ఉంది.

# తెలంగాణకు మళ్లీ సీఎం కేసీఆర్ రావాలి

## శ్రీ వెంకటేశ్వర స్వామివారినీ వేడుకున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని)తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ రాక్షస పాలన నుండి ప్రజలను విముక్తి చేసి మళ్లీ తెలంగాణ సీఎంగా కేసీఆర్ రావాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ ఏడు శనివారాల దర్శనం మొక్కులో భాగంగా నాలుగవ శనివారం కాలినడకన తిరుమల కొండ కు నాలుగవ సారి అలిపిరి నుండి నాలుగు గంటల పాటు నడిచి మెట్లు ఎక్కి తలనీలాలు సమర్పించి ఉదయం దర్శనం చేసుకుని వెంకటేశ్వర స్వామిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని, మళ్లీ రామగుండం నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గా ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగించాలని,నన్ను నమ్ముకున్నా వారి బాధలు తీర్చే బలం ఇవ్వాలని,



రామగుండం నియోజకవర్గం లోని సకల జనుల ప్రజల బాధలు సమస్యలు పరిష్కారం కావాలని ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండే విధంగా ఆశీర్వదించుమని దేవున్ని వేడుకున్నానని తెలిపారు.

# వాల్వో డంప్ ట్రక్ ఆపరేటర్లకు సర్టిఫికెట్లు ప్రధానం

తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 28:సింగరేణి సంస్థ చైర్మన్ అదేశాలతో సింగరేణి సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకముగా (సి.యస్.ఆర్) సామాజిక భాద్యత స్వయం ఉపాధి కల్పనలో భాగముగా సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు ఆర్జీ.1 టిటిసి నందు వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణలో 18 రోజులు విటిసి నందు 12 రోజుల వరకు ఆర్జి-1 ఏరియాలోని టి.టి.సి నందు నిర్వహించడం జరిగినది. ఇట్టి శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ ఇచ్చు కార్యక్రమామానికి శనివారం జిఎం డి.లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై 49 మంది నిరుద్యోగ యువకులకు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భముగా జియం మాట్లాడుతూ వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ పొందిన వారు భారత దేశంలోనే కాకుండా విదేశాలలో అన్ని చోట్ల నడుచు వోల్వో డంప్ ట్రక్ లలో డ్రైవింగ్ శిక్షణ పొంది సర్టిఫికెట్ కలిగిన వారికి పని చేసే అవకాశం లభిస్తుందని తెలిపారు.ఇప్పటి వరకు ఆర్జి-1 టిటిసి నందు 13 బ్యాచ్ లో 651 మందికి సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగినదని, ఇందులో 130 మంది వివిధ కంపెనీలలో డంప్ ట్రక్ డ్రైవర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. ఇట్టి శిక్షణ పొందిన నిరుద్యోగ యువకులకు శిక్షణ సమయంలో వారికీ ఉచిత వసతి, భోజనాలు కల్పించి ప్రత్యేకంగా వోల్వో డంప్ ట్రక్



కంపని వారి సహాకారంతో సింగరేణి డైరెక్టర్స్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ నిర్వహించడము జరిగిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జియం చంద్రశేఖర్, టిటిసి మేనేజర్ అశోక్ రావు, జివిటిసి మేనేజర్ మాధవ రెడ్డి , పర్సనల్ ఆఫీసర్స్ శ్రావణ్ కుమార్, హన్మంతరావు, వోల్వో డంప్ ట్రక్ మేనేజర్ హరిబాబు, వోల్వో శిక్షకుడు సంజీవ్, టిటిసి స్టాఫ్ పద్మారావు, సత్తన్న, జివి రావు, ఆయుబ్ పాషా, కృష్ణ, తదితర అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ వర్సెస్ అల్లర్లు..

# బెంగాల్‌లో వేడెక్కిన ఎన్నికల ప్రచారం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ లో ఎన్నికల వాతావరణం శనివారంనాడు ఒక్కసారిగా వేడెక్కింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రధానాస్త్రంగా చేసుకుని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రచారం సాగించగా, శ్రీరామ నవమి ఊరేగింపులో అల్లర్లు, చొరబాటుదార్ల సమస్యలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రచారం జరిపారు. శ్రీరామ నవమి అల్లర్లకు బీజేపీనే కారణమని మమత విమర్శలు గుప్పించగా, దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ సజావుగా జరుగుతుంటే పశ్చిమబెంగాల్‌లోనే న్యాయ అధికారులను మోహరించాల్సి వచ్చిందని అమిత్‌షా తప్పుపట్టారు. కోల్‌కతాలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో అమిత్‌షా మాట్లాడుతూ, రాష్ట్రంలో తిష్టవేసిన చొరబాటుదారులు బెంగాల్ భవిష్యత్తును నిర్ణయిస్తుంటే చూస్తూ ఊరుకుందామా? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రతి ఒక్క చొరబాటుదారుని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించడానికే పరిమితం కాకుండా దేశం నుంచి వెళ్లగొడతామని, ఇది బీజేపీ ఎజెండా అని స్పష్టం చేశారు. టీఎంసీ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల సిలిగురి



కారిడార్ భద్రతకు ప్రమాదం ఉందని అన్నారు. ఒకరకంగా దేశ భద్రత బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉందని, చొరబాటుదారులు ప్రవేశిస్తున్న ఏకైక రాష్ట్రంగా పశ్చిమబెంగాల్ నిలుస్తోందని ఆరోపించారు.

# ఏపీకి అమరావతి మాత్రమే రాజధాని.. తేల్చి చెప్పిన డిప్యూటీ సీఎం పవన్..

అమరావతి, మార్చి 28: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు.శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# చిన్న దూరమైనా సీట్ బెల్ట్ ధరించండి...

## ప్రాణ రక్షణలో కీలక పాత్ర: రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



### ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రామగుండం కమిషనరేట్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' ఫేజ్- కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చౌరస్తా వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల ప్రాణ రక్షణ ప్రధాన లక్ష్యంగా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 70 శాతం కేసుల్లో సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్లనే తీవ్రమైన గాయాలు లేదా ప్రాణనష్టం జరుగుతున్నట్లు తెలిపారు. సీట్ బెల్ట్ వినియోగం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ఫోర్ వీలర్ వాహనాల్లో ఎయిర్ బ్యాగులు ఉన్నప్పటికీ,సీట్ బెల్ట్ ధరించకపోతే అవి సమర్థవంతంగా పని చేయవని స్పష్టం చేశారు. కాబట్టి ఎయిర్ బ్యాగులు ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

వాహనం కొనుగోలు సమయంలో ప్రజలు అధునాతన భద్రతా సదుపాయాలు కలిగిన మోడళ్లను ఎంచుకోవాలని, ముఖ్యంగా ఎయిర్ బ్యాగులు,సీట్ బెల్ట్ రిమైండర్లు వంటి భద్రతా లక్షణాలను పరిశీలించాలని సూచించారు. చిన్న దూరమైనా,పెద్ద దూరమైనా ప్రతి ప్రయాణంలో సీట్ బెల్ట్ ధరించడం అలవాటు చేసుకుంటే దాదాపు 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని, ఒకవేళ ప్రమాదం జరిగినా ప్రాణనష్టం లేకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాహనదారులను సీపీ కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు,ఎస్ఐలు రమేష్,అనూష, మనోహర్,ట్రాఫిక్ ఎస్ఐ హరీష్ శేఖర్, రామరాజు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక సంఘాలను కలవటానికి నిరాకరిస్తున్న సింగరేణి చైర్మన్, డైరెక్టర్(పా):ఇఫ్టు ఆరోపణ

తెలంగాణ అవతరణ, గోదావరిఖని, మార్చ్ 28:సింగరేణి అర్జీ-1 పరిధిలోని జీడికె 2ఏ ఇంక్లైన్ లో కార్మికులను జీఎల్బికెఎస్ -ఇఫ్టు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ శనివారం కలిశారు. ఇ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ... సింగరేణి సంస్థ సంక్షోభంలో ఉందని దీని నుండి బయటపడడానికి సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు మరింత శాపంగా మారుతున్నాయని తెలిపారు. కార్మికులు అనేక సమస్యలతో తప్పనిసరి పరిస్థితులతో సర్వీస్ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు అనేకచోట్ల నిరంకుశంగా వ్యవహ స్తున్నారనీ, సింగరేణి కి కొత్తగా వచ్చిన చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ బుద్ధ ప్రకాష్ ను కలవడానికి నెలరోజుల నుండి ప్రయత్నిస్తున్న ఆయన అపాయింట్మెంట్ ఇవ్వటం లేదని ఆరోపించారు. మేము కార్మికుల సమస్యలు తన దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ యాజమాన్యం సహకరించడం లేదు అని అన్నారు. కొత్తగూడెం హెడ్ ఆఫీస్ లో అడుగు పెట్టడానికి అనేక ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. కార్మిక సంఘ నాయకులు




అధికారులను కలవడానికి లోనికి అనుమతించడం లేదని, డైరెక్టర్ పా గౌతమ్ పొట్రూ కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడడానికి కలవడానికి నిరాకరిస్తున్నాడుని తెలిపారు. కార్మికులందరూ కూడా ఇట్టి పరిస్థితుల్ని అర్థం చేసుకోవాలని, వీరి అహంభావాన్ని పోరాటాలతో బుద్ధి చెప్పాలని కోరారు. ఇందులో నాయకులు ఇ.నరేష్ ఐ రాజయ్య, ఇ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విషాదంలో మహా పుణ్యదానం..!

## - తండ్రి నేత్రదానంతో ఇద్దరికి చూపు - స్ఫూర్తిగా నిలిచిన కుటుంబం

## - అభినందించిన సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కే.ఎస్. వాసు



(తెలంగాణ ఉతరణ ప్రతినిధి గోదావరిఖని) పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలోని అన్నపూర్ణ కాలనీకి చెందిన దాసరి రామచందర్(70) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున గోదావరిఖని జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంటి పెద్ద మృతితో విషాదంలో ఉన్న కుటుంబం, మానవత్వాన్ని చాటుతూ అతని నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు వెలుగులు పంచారు. మూడు నెలల క్రితం తల్లి మల్లమ్మ మరణించడంతో, ఆమె నేత్రాలను దానం చేసిన కుటుంబం, ఇప్పుడు తండ్రి రామ్ చందర్ నేత్రాలను కూడా దానం చేసేందుకు కొడుకు-కోడలు పద్మారావు--కావ్య, కూతుళ్లు--అల్లుళ్లు సువర్ణ--గోపాల్, మాధవి--రాజు, సుష్మా--కుమార్ ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు బెనిగోపాల్ త్రివేది, అన్నపూర్ణ త్రివేది ఆధ్వర్యంలో టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతుని కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. నేత్రదాతకు నివాళులర్పించి, అభినందన పత్రాన్ని అందజేశారు. దుఃఖ సమయంలోనూ ఉదాత్త మనసుతో నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, కే.ఎస్. వాసు, భీష్మాచారి, వెద్దీ అనంతరాములు, కవిత, తాడబోయిన రామన్న, శశికళతోపాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి మల్లికార్జున్, కజాంపురం రాజేందర్ అభినందించారు.

## ఫైళ్లకే పరిమితమైన ప్రాజెక్టులను

# పట్టాలెక్కించాం: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ,మార్చి,28:** నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంలో గత ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 2004 నుంచి 2014 మధ్య కాలంలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కేవలం ఫైళ్లకే పరిమితమైందని, అభివృద్ధి పట్ల కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలకు ఉన్న చిత్తశుద్ధి లేమికి ఇది నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఒకప్పుడు కేవలం కాగితాల మీద మాత్రమే ఉన్న జేవార్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్.. నేడు క్షేత్రస్థాయిలో వాస్తవ రూపం దాల్చుతోందని ప్రధాని అన్నారు. 2004లో ప్రతిపాదించినప్పటికీ.. పదేళ్ల పాటు కేంద్రంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న ఎస్పీ ప్రభుత్వం దీనిని ముందుకు తీసుకెళ్లడంలో విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంత అభివృద్ధిని గత పాలకులు అడ్డుకున్నారని ఆరోపించారు. 2014 తర్వాత దేశంలో, 2017 తర్వాత ఉత్తరప్రదేశ్‌లో వచ్చిన మార్పుల వల్ల ఆగిపోయిన ప్రాజెక్టులన్నీ వేగవంతమయ్యాయని మోదీ చెప్పుకొచ్చారు. పర్యావరణ, భూసేకరణ వంటి క్లిష్టమైన సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టులను పట్టాలెక్కించినట్లు తెలిపారు. జేవార్ ఎయిర్‌పోర్ట్ కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, ఇది ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది మంది యువతకు ఉపాధి లభించడమే కాకుండా, పశ్చిమ యూపీ పారిశ్రామిక హబ్‌గా మారుతుందని స్పష్టం చేశారు. 'పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదు?' అని ప్రధాని ప్రతిపక్షాలను మోదీ ప్రశ్నించారు.

# సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'లోక' సీక్వెల్




'లోక: చాప్టర్ 1' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ సూపర్ ఉమెన్ ఫాంటసీ థ్రిల్లర్‌లో ఆమె అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కాయి. గత ఏడాది మలయాళంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'లోక: చాప్టర్ 1' రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సీక్వెల్ గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే ఓ ఈవెంట్‌లో పాల్గొన్న కల్యాణి ప్రియదర్శన్ సీక్వెల్‌లో తాను భాగమవుతున్నానని వెల్లడించింది. ప్రస్తుతం స్క్రిప్ట్‌వర్క్‌లో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి వెళ్తుందని, సీక్వెల్‌లో విజువల్స్‌కు అధిక ప్రాధాన్యం ఒటుందని.. కథ, కథనాలు మరింత ఉత్కంఠను పంచుతాయని తెలిపింది.

# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' ' ఫలక్‌ను మా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భా షల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ!



సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా, వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్ కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నా ని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్ కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది.అందుకే ప్రభుత్వం ఈ సోప్ ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు.

ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు.బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ

# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు.భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా ‿ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది.




# తెలంగాణ నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం'



సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకుంది. కొత్తదనం కలబోసిన కథల్ని ఎంచుకుంటూ పాత్రలపరంగా ప్రయోగాలకు సిద్ధమంటున్నది. తెలుగులో ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేష్ వీకే, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. బుధవారం అనుపమ పరమేశ్వరన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పెళ్లి కూతురుగా ముస్తాబై పట్టరాని ఆనందంతో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నది అనుపమ పరమేశ్వరన్. పెళ్లి చుట్టూ సాగే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఆమె కీర్తి అనే పాత్రలో కనిపిస్తుందని, తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ ధూపాటి, సంగీతం: సురేష్ బొబ్బిలి, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: బద్రప్ప గాజుల.

# మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్



టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంట్టంల్గ÷న్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత.

రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

# ఫ్యామిలీపై విమర్శలు చేస్తే ఊరుకునేదే లేదు



గత ఏడాది జరిగిన 'బ్రహ్మానందం' సినిమా ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన సరదా వ్యాఖ్యలు అప్పట్లో సోషల్ మీడియాలో పెద్ద వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఇంటికి వెళ్తే "లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉంటాను" అంటూ కుటుంబంలో మహిళల ప్రాధాన్యత గురించి సరదాగా చెప్పిన ఆ వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ఆ కామెంట్స్ మళ్లీ తాజాగా ట్రెండ్ అయ్యాయి. ముఖ్యంగా రామ్ చరణ్ – ఉపాసన దంపతులకు బాబు పుట్టిన సందర్భంగా ఆ పాత వీడియోలను తీసుకువచ్చి చిరంజీవిని ట్రోల్ చేయడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మెగా కోడలు, వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి సోషల్ మీడియాలో గట్టిగా స్పందించారు. కుటుంబానికి సంబంధించిన సంతోషకరమైన క్షణాలను కూడా వివాదాస్పదం చేయడం సరికాదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి మహిళలను ఎంత గౌరవంగా చూస్తారో తెలియకుండా విమర్శలు చేయడం బాధాకరమని, ఇతరులను విమర్శించే ముందు వారి వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాలని ట్వీట్ రూపంలో పేర్కొన్నారు. తాజాగా మరోసారి ఈ అంశంపై స్పందించిన లావణ్య "మా కుటుంబం జోలికి ఎవరైనా వస్తే అస్సలు ఊరుకోను" అంటూ స్పష్టం చేశారు. చిరంజీవి తన కుటుంబంలోని మహిళలను, ముఖ్యంగా మనవరాళ్లను ఎంతో ప్రేమగా చూసుకుంటారని, ఆయన వ్యక్తిత్వం గురించి మాట్లాడే వారు ఆయన చేసిన సేవల్లో ఒక్క శాతం కూడా చేయలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. అంటూ ఆమె చేసిన ఆంగ్ల ట్వీట్ కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఇదిలా ఉండగా పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం 'సతీ లీలావతి'పై కూడా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో లావణ్య సరసన దేవ్ మోహన్ హీరోగా నటిస్తుండగా తాతినేని సత్య దర్శక త్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మొత్తంగా కుటుంబ గౌరవం విషయంలో లావణ్య త్రిపాఠి తీసుకున్న స్టాండ్ మెగా అభిమానులను ఆకట్టుకుంటుండగా సోషల్ మీడియాలో ఈ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411